www.aksharadarbar.com

శుక్రవారం 09, ఆగస్టు 2024

అక్షర దర్బార్

voice of the people

తెలుగు దినపత్రిక వరంగల్ | సంపుటి :02 | సంచిక :159 | పేజీలు : 05 | వెల : 05

మున్సిపల్ అధికారి

ఇంట్లో నోట్ల కట్టలు..

- ఏసీబీ దాడుల్లో బయటపడిన ఆస్తులు
- నిజామాబాద్ మున్సిపల్ సూపరింటెండెంట్ దాసరి నరేందర్ నివాసంలో
- రూ.2.93 కోట్ల నగదు పట్టివేత..
- మొత్తం ఆస్తుల విలువ రూ. 6.07 కోట్లు..

05

కుక్కల దాడిలో బాలుడి మృతి

- తీవ్ర గాయాలతో 20 రోజులుగా చికిత్స
- రంగారెడ్డి జిల్లా రాయపోల్‌లో ఘటన

02



నీటిపారుదల శాఖలో జగడ్ 'లీలలు'

నీటిపారుదల శాఖలో పదేళ్ల నుంచి ఒకే స్థానంలో పాతుకుపోయిన ములుగు జిల్లా ఏటూరునాగారం డివిజన్ లోని ఉన్నతాధికారి ప్రభుత్వ నిర్ణయాలను పక్కన పెడుతూ తన స్వప్రయోజనాల కోసం సొంత నిర్ణయాలను అమల్లో పెడుతున్న విషయం తెలిసిందే. ఏటూరునాగారంలోని డివిజన్ కార్యాలయం అధికారులు, ఉద్యోగులను విధులకు దూరంగా ఉంచుతూ హనుమకొండలోని క్యాంపు ఆఫీసు ద్వారా ఇరిగేషన్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఆయన క్షేత్రస్థాయిలో కూడా అదే విధానాన్ని అవలంభిస్తున్నారు. ఈ డివిజన్ పరిధిలోని మండలాల్లో క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే ఇంజినీర్లలో తనకు అనుకూలంగా వ్యవహరిస్తున్న ఒకే ఒక ఇంజనీర్ ను ప్రోత్సహిస్తున్నారు. ఈ క్రమంలో సదరు ఇంజినీర్ కు సంబంధం లేని డివిజన్ లోని ఇరిగేషన్ ప్రధాన పనులను 'ప్రావీణ్యు'డని ఆయనకే అప్పగిస్తూ స్థానికంగా ఉన్న ఇతర ఇంజినీర్లను పక్కన పెడుతున్నారు. దీంతో ఒక మండలంలోని పనులను పర్యవేక్షించాల్సిన ప్రావీణ్యుడు డివిజన్ లోని ఇతర మండలాల్లోనూ ఇరిగేషన్ మేజర్ పనులను పర్యవేక్షిస్తూ ఒకే ఒక్కడుగా కొనసాగుతుండటం డిపార్ట్ మెంట్ లో చర్చనీయాంశమైంది. అయితే ఏటూరునాగారం ఇరిగేషన్ డివిజన్ లో అసలు ఏమి జరుగుతుంది అనే కోణంలో తమ నెట్ వర్క్ ద్వారా నిఘావిభాగాలు వివరాలను సేకరిస్తున్నట్లు తెలిసింది. ఇదే సమయంలో తన సొంత నిర్ణయాల అమలుతో రూ.కోట్లు కూడబెట్టిన ఉన్నతాధికారి అక్రమాలపై ప్రభుత్వ నిఘా విభాగాల అధికారులూ ఆరా తీస్తున్నట్లు తెలిసింది. - అక్షరదర్బార్, నిఘా విభాగం

ఏటూరునాగారం ఇరిగేషన్ డివిజన్ లో ఐదు సబ్ డివిజన్లు

ఐదింటిలో నిపుణులైన ఇంజినీర్లు ఉన్నా పనులకు దూరం పెడుతున్న వైనం

క్షేత్రస్థాయిలో 'ప్రావీణ్యు'డు!

- ఒక సబ్ డివిజన్ ఇంజినీర్ కే ఇతర సబ్ డివిజన్లలోని మేజర్ పనులు కేటాయింపు
- ఉత్తర్వులేవి ఇవ్వకుండా మౌఖిక ఆదేశాలతోనే పనుల అప్పగింత
- సుదీర్ఘకాలంగా డివిజన్ లో ఇరిగేషన్ పనుల పర్యవేక్షణలో ఒకే ఒక్కడు
- స్వప్రయోజనాల కోసం ఉన్నతాధికారి సొంత నిర్ణయాలు అమలు
- ఇరిగేషన్ శాఖలో 'అక్షరదర్బార్' వరస కథనాలు కలకలం
- ఉన్నతాధికారి వ్యవహారం, అక్రమాలపై నిఘా విభాగాల ఆరా

02

మత్తడి దుంకుతున్న పాకాల

03



తెలంగాణ ఫ్యూచర్ స్టేట్..

- దీన్ని ట్యాగ్ లైన్‌గా పెట్టుకుందాం...
- అమెరికా పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి
- టెక్ యునికార్న్స్ సీఈవోలతో భేటీ..

02

జయశంకర్ భూపాలపల్లి జిల్లా తర్వాత అంతటి ప్రాచుర్యం పొందినదిగా చెప్పుకుంటున్న మండలం కాటారం .. ఇక్కడ సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయం ఉండగా గత ప్రభుత్వం ఆర్డీవో కార్యాలయాన్ని సైతం కేటాయిస్తూ ఆర్డినెన్స్ జారీ చేసింది. ప్రస్తుత ప్రభుత్వం ఆర్డీవో కార్యాలయానికి ఐఏఎస్ కేడర్ అధికారిని కేటాయించింది. గతంలో కాటారం మండలానికి చెందిన జక్కు శ్రీహర్షిణి జయశంకర్ భూపాలపల్లి జెడ్పీ ఛైర్మన్ గా ప్రాతినిధ్యం వహించగా ప్రస్తుతం ఇదే మండలం నుంచి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలంగాణ ఐటీ మినిష్టర్ గా కొనసాగుతున్నాడు. ఇంతటి ప్రాచుర్యం కలిగిన కాటారం మండలానికి బస్టాండ్ కొరత ప్రజలను వేధిస్తోంది. జిల్లా తర్వాత జిల్లాగా పిలువబడుతున్న కాటారంలో బస్టాండ్ కే దిక్కులేదని హేళన చేస్తూ పలువురు మాట్లాడిన సందర్భాలు లేకపోలేదు. దీంతో చేసేదేం లేక బస్సుల కోసం షాపుల ముందు ఎండనకా.. వాననగా నిలబడి ఎదురుచూస్తూ ప్రజలు పడుతున్న తీరు వర్ణణాతీతం.

– అక్షర దర్బార్, కాటారం

కాటారం ప్రజల బతుక్కు

బస్టాండ్ (లేనట్లే)నా..!

- రోడ్లపైనే ప్రయాణికుల పడిగాపులు
- ఆత్మగౌరవ సమస్యగా మారిన వైనం
- మంత్రి శ్రీధర్ బాబుపై గంపెడు ఆశలు
- బస్టాండ్ స్థలం చుట్టూ నడుస్తున్న వివాదం

03

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

క్షేత్రస్థాయిలో 'ప్రావీణ్యు'డు!

నీటిపారుదల శాఖలో జగడ్ 'లీలలు'

- ఏటూరునాగారం ఇరిగేషన్ డివిజన్ లో ఐదు సబ్ డివిజన్లు
- ఐదింటిలో నిపుణులైన ఇంజనీర్లు ఉన్నా పనులకు దూరం పెడుతున్న వైనం
- ఒక సబ్ డివిజన్ ఇంజనీర్ కే ఇతర సబ్ డివిజన్లలోని మేజర్ పనులు కేటాయింపు
- ఉత్తర్వులేవి ఇవ్వకుండా మౌఖిక ఆదేశాలతోనే పనుల అప్పగింత
- సుదీర్ఘకాలంగా డివిజన్ లో ఇరిగేషన్ పనుల పర్యవేక్షణలో ఒకే ఒక్కడు
- స్వప్రయోజనాల కోసం ఉన్నతాధికారి సొంత నిర్ణయాలు అమలు
- ఇరిగేషన్ శాఖలో 'అక్షరదర్బార్' వరస కథనాలు కలకలం
- ఉన్నతాధికారి వ్యవహారం, అక్రమాలపై నిఘా విభాగాల ఆరా

అక్షరదర్బార్, నిఘా విభాగం: నీటిపారుదల శాఖలో పదేళ్ల నుంచి ఒకే స్థానంలో పాతుకుపోయిన ములుగు జిల్లా ఏటూరునాగారం డివిజన్ లోని ఉన్నతాధికారి ప్రభుత్వ నిర్ణయాలను పక్కన పెడుతూ తన స్వప్రయోజనాల కోసం సొంత నిర్ణయాలను అమల్లో పెడుతున్న విషయం తెలిసిందే. ఏటూరునాగారంలోని డివిజన్ కార్యాలయం అధికారులు, ఉద్యోగులను విధులకు దూరంగా ఉంచుతూ హనుమకొండలోని క్యాంపు ఆఫీసు ద్వారా ఇరిగేషన్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఆయన క్షేత్రస్థాయిలో కూడా అదే విధానాన్ని అవలంభిస్తున్నారు. ఈ డివిజన్ పరిధిలోని మండలాల్లో క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే ఇంజనీర్లలో తనకు అనుకూలంగా వ్యవహరిస్తున్న ఒకే ఒక ఇంజనీర్ ను ప్రోత్సహిస్తున్నారు. ఈ క్రమంలో సదరు ఇంజనీర్ కు సంబంధం లేని డివిజన్ లోని ఇరిగేషన్ ప్రధాన పనులను 'ప్రావీణ్యు'డని ఆయనకే అప్పగిస్తూ స్థానికంగా ఉన్న ఇతర ఇంజనీర్లను పక్కన పెడుతున్నారు. దీంతో ఒక మండలంలోని పనులను పర్యవేక్షించాల్సిన ప్రావీణ్యుడు డివిజన్ లోని ఇతర మండలాల్లోనూ ఇరిగేషన్ మేజర్ పనులను పర్యవేక్షిస్తూ ఒకే ఒక్కడుగా కొనసాగుతుండటం డిపార్ట్ మెంట్ లో చర్చనీయాంశమైంది. తన అనుచరుడైన ఈ ప్రావీన్యుడికి డివిజన్ ఉన్నతాధికారి ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వకుండా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కేవలం మౌఖిక ఆదేశాలతోనే ఇతర మండలాల్లోని ఇరిగేషన్ పనులను అప్పగిస్తుండటం గమనార్హం. ప్రతిష్టాత్మకమైన సమ్మక్క సాగర్ బ్యారేజీ నిర్మాణ పనులతో పాటు ఏటూరునాగారం ఇరిగేషన్ డివిజన్ లోని వివిధ మండలాల్లో ప్రభుత్వం చేపట్టే ఇరిగేషన్ పనులు అన్నింటిని కూడా ఉన్నతాధికారి అనుచరుడైన ఒకే ఒక్కడు పర్యవేక్షిస్తుండటం సుదీర్ఘకాలం నుంచి కొనసాగుతుంది. ఇదేమిటని అభ్యంతరం తెలిపిన నైపుణ్యత గల స్థానిక ఇంజనీర్లను తన నిర్ణయాన్ని ప్రశ్నిస్తారా? అంటూ వేధించటమే గాకుండా బదిలీ కూడా చేయించినట్లు తెలిసింది. దీంతో ఈ డివిజన్ లోని ఇరిగేషన్ ఇంజనీర్లు, ఉద్యోగులు గాని ఎవరూ తమ బాస్ నిర్ణయాన్ని ప్రశ్నించడం లేదు.

ఏటూరునాగారం డివిజన్ లోని ఉన్నతాధికారి వ్యవహారంపై మంగళవారం నుంచి 'అక్షర దర్బార్' పత్రికలో ప్రచురితమైన వరుస కథనాలు ఇరిగేషన్ డిపార్ట్ మెంట్ లో కలకలం సృష్టించగా శాఖలోని ఉన్నతాధికారులు తాజాగా ఈ డివిజన్ పై దృష్టి సారించినట్లు సమాచారం. ఏటూరునాగారం ఇరిగేషన్ డివిజన్ లో అసలు ఏమి జరుగుతుంది అనే కోణంలో తమ నెట్ వర్క్ ద్వారా వివరాలను సేకరిస్తున్నట్లు తెలిసింది. ఇదే సమయంలో తన సొంత నిర్ణయాల అమలుతో రూ.కోట్లు కూడబెట్టిన ఉన్నతాధికారి అక్రమాలపై ప్రభుత్వ నిఘా విభాగాల అధికారులూ ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

సబ్ డివిజన్లు ఇవే

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇరిగేషన్ మేజర్ పనులు ఎక్కువగా జరిగే ఏటూరునాగారం డివిజన్ పరిధిలో పునర్వ్యవస్థీకరణ తర్వాత 2021 నుంచి ఐదు సబ్ డివిజన్లు పనిచేస్తున్నాయి. వెంకటాపురం, వాజేడు, మంగపేట, ఏటూరునాగారం, కన్నాయిగూడెం కేంద్రంగా ఈ సబ్ డివిజన్లు పనిచేస్తున్నట్లు తెలిసింది. అయితే కన్నాయిగూడెం మండలంలో గోదావరి నదిపై రూ.వేల కోట్లతో ప్రభుత్వం చేపట్టిన సమ్మక్క సాగర్ బ్యారేజీతోపాటు చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు ఇంటెక్ వెల్ వంటివి ఉన్నాయి. ఇరిగేషన్ పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు ప్రభుత్వం ఆయా సబ్ డివిజన్ లో అవసరమైన ఇంజనీర్లను నియమించింది. అయితే ఈ డివిజన్ లోని ఉన్నతాధికారి మాత్రం ఒక సబ్ డివిజన్ లో పనిచేస్తున్న ఇంజనీర్ తోనే ఈ డివిజన్ లోని ఐదు సబ్ డివిజన్ల పరిధిలో ప్రభుత్వం చేపట్టే మేజర్ ఇరిగేషన్ మేజర్ పనుల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగిస్తుండటం విశేషం. ఇప్పటికే ప్రభుత్వం సుమారు రూ.2 వేల కోట్ల చెల్లింపులు జరిపిన సమ్మక్క సాగర్ బ్యారేజీ నిర్మాణ పనుల పర్యవేక్షణ బాధ్యతలను కూడా పని రాదని స్థానిక ఇంజనీర్ ను పక్కనపెట్టి ఇతర సబ్ డివిజన్ లోని తన అనుచరుడైన ప్రావీణ్యుడికి ఉన్నతాధికారి అప్పగించినట్లు తెలిసింది. వాజేడు మండలంలోని పాలెం వాగు ప్రాజెక్టు పనులు, మంగపేట మండలంలోని విలువైన కరకట్టల నిర్మాణ పనులతోపాటు ఇలా డివిజన్ లోని వివిధ మండలాల్లో ప్రభుత్వం చేపట్టిన ఇరిగేషన్ మేజర్ పనుల పర్యవేక్షణను అదే ఇంజనీర్ ప్రావీణ్యుడికి లీడరైన ఉన్నతాధికారి కేటాయించినట్లు సమాచారం. చాలా ఏళ్ల నుంచి పునర్వ్యవస్థీకరణకు ముందు, తర్వాత సదరు ఉన్నతాధికారి ఇలాగే వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే ఆయా సబ్ డివిజన్ లోని నిపుణులైన ఇంజనీర్లు తాము ఉండగా మరో సబ్ డివిజన్ ఇంజనీర్ కు పనుల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించడం ఏమిటని అడిగినందుకు ఉన్నతాధికారి ఒక డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తో పాటు ముగ్గురు అసిస్టెంట్ ఇంజనీర్లను కొంతకాలం వేయించి తర్వాత డిపార్ట్మెంట్ లో ఉన్నత స్థాయిలో ఉన్న తన గాడ్ ఫాదర్ ద్వారా బదిలీ చేయించినట్లు శాఖలో చెప్పుకుంటున్నారు. దీంతో కొందరు ఇంజనీర్లు ఈ ఉన్నతాధికారి తీరును భరించలేక, చేసేదేమీ లేక చివరకు ఇతర ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లిపోయినట్లు తెలిసింది.

అక్రమార్జన కోసమే...

విచారణలో ఎక్కడ దొరకకుండా ఉండేందుకు ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వకుండా కేవలం మౌఖిక ఆదేశాలతోనే సదరు ఉన్నతాధికారి తనకు అనుకూలంగా వ్యవహరిస్తున్న ఒకే ఇంజనీర్ కు నిబంధనలకు విరుద్ధంగా డివిజన్ లోని మేజర్ పనుల పర్యవేక్షణ బాధ్యతలు కేటాయించి, తద్వారా పర్సంటేజీల రూపంలో సమకూరే అక్రమ ఆదాయాన్ని సుదీర్ఘకాలం నుంచి పెద్ద మొత్తంలో ఆయనే పొందుతున్నట్లు సమాచారం. ఉన్నత స్థాయిలో ప్రస్తుతం ఎక్స్ టెన్షన్ పై పని చేస్తున్న ఇరిగేషన్ లోని ఒక ఉన్నతాధికారి ఈయనకు అడుగడుగున గొడుగు పడుతున్నట్లు తాజాగా నిఘా విభాగాల అధికారుల దృష్టికి వచ్చినట్లు తెలిసింది. ఏటూరునాగారం డివిజన్ లోని ఉన్నతాధికారి ఎప్పటినుంచి ఒకే చోట పనిచేస్తున్నారు, ఆయనపై ఉన్న ఆరోపణలు ఏమిటి, ఎలాంటి అక్రమాలకు పాల్పడ్డారు అనే వివరాలను నిఘా విభాగాల అధికారులు లోతుగా సేకరిస్తున్నట్లు సమాచారం.

తెలంగాణ ఫ్యూచర్ స్టేట్

- దీన్ని ట్యాగ్ లైన్ గా పెట్టుకుందాం...
- అమెరికా పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి
- టెక్ యునికార్న్ సీఈవోలతో భేటీ..

ఢిల్లీ, అక్షరదర్బార్ : ఇకపై తెలంగాణ రాష్ట్రాన్ని తెలంగాణ ఫ్యూచర్ స్టేట్ అని పిలుద్దామని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్ పునర్నిర్మాణంలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్, నెట్ జీరో సిటీ లాంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులతో తెలంగాణ రాష్ట్రం 'ది ఫ్యూచర్ స్టేట్'కు పర్యాయపదంగా నిలుస్తుందని సీఎం ప్రకటించారు. అమెరికా పర్యటనలో ఉన్న సీఎం.. కాలిఫోర్నియాలో ఇండియన్ కాన్సులేట్ జనరల్ నిర్వహించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బిజినెస్ రౌండ్‌టేబుల్‌లో టెక్ యునికార్న్ సీఈవోలను ఉద్దేశించి మాట్లాడారు. ఐటీ యూనికార్న్ ప్రతినిధులందరూ తెలంగాణకు రావాలని ఆహ్వానించారు. 'మీ భవిష్యత్తును ఆవిష్కరించుకొండి. అందరం కలిసికట్టుగా సరికొత్త భవిష్యత్తును తీర్చిదిద్దుకుందాం' అని సీఎం రేవంత్ పిలుపునిచ్చారు. 'ఇప్పటి వరకు మేం న్యూయార్క్, న్యూజెర్సీ, వాషింగ్టన్ డీసీ, టెక్సాస్‌లో పర్యటించాం. ఇప్పుడు కాలిఫోర్నియాలో ఉన్నాం. అమెరికాలో ప్రతి రాష్ట్రానికి ఒక ప్రత్యేక లక్ష్యం.. ఆ లక్ష్యాన్ని సూచించే నినాదం ఉంది. అవుటాఫ్ మెనీ.. వన్ అనేది న్యూయార్క్ స్టేట్ నినాదం. టెక్సాస్‌ను లోన్ స్టార్ స్టేట్ అని పిలుస్తారు. కాలిఫోర్నియాకు యురేకా అనే నినాదం ఉంది. అయితే మన ఇండియాలోని రాష్టాలకు ఇటువంటి ప్రత్యేక నినాదాలేమీ లేవు. ఇప్పటి నుంచి తెలంగాణ రాష్ట్రానికి అటువంటి ఒక లక్ష్య నినాదాన్ని ట్యాగ్ లైన్‌గా పెట్టుకుందాం. ఇకపై మన రాష్ట్రాన్ని తెలంగాణ ఫ్యూచర్ స్టేట్.. అని పిలుద్దాం.' అని సీఎం ప్రకటించారు.

రుణ విముక్తి చేస్తాం..

- ఆగస్టు 15లోపు వైరాలో భారీ రైతు బహిరంగ సభ
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

హైదరాబాద్, అక్షరదర్బార్: ఈనెల 15న రాష్ట్రంలో రైతులకు రుణ విముక్తి చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని రాష్ట్ర ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని భట్టి అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత 2 లక్షల రైతుల రుణ మాఫీ చేస్తాం అని హామీ ఇచ్చామని.. చేసి చూపిస్తున్నామని తెలిపారు. జూలై 15 న జీవో ఇచ్చామని.. 18 జూలైన లక్ష రూపాయల రుణమాఫీ 6,983 కోట్లు విడుదల చేశామని తెలిపారు. రెండవ సారీ రూ.6190.02 కోట్లతో జూలై మాసంలో మళ్ళీ విడుదల చేశామన్నారు. రైతుల రుణమాఫీ చేయడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఆగస్ట్ 15లోపు వైరాలో భారీ రైతు బహిరంగ సభ నిర్వహిస్తామని, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రివర్గం, ఎమ్మెల్యేలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొంటారని తెలిపారు.

కుక్కల దాడిలో బాలుడి మృతి

- తీవ్ర గాయాలతో 20 రోజులుగా చికిత్స
- రంగారెడ్డి జిల్లా రాయపోలులో ఘటన

హైదరాబాద్, అక్షరదర్బార్ : తెలంగాణలో వీధి కుక్కల దాడులు ఆగటంలేదు. రాష్ట్రంలో ఏదో ఓ మూల దాడులు జరుగుతూనే ఉన్నాయి. వీధి కుక్కల దాడులకు పసివాళ్లు బలవుతున్నారు. తాజాగా.. నగరంలో శునకాల దాడిలో మరో బాలుడు మృతి చెందాడు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్‌లో 20 రోజుల క్రితం కుక్కల దాడిలో క్రియాన్స్ అనే నాలుగేళ్ల బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రికి తరలించారు. కాగా, చికిత్స పొందుతూ బాలుడు శుక్రవారం మృతిచెందాడు.

పురుషాంగాన్ని కొరికేశాయి..

రంగారెడ్డి జిల్లా నర్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కోకాపేట్ సబితా నగర్‌లో ఓ కుటుంబం గుడిసె వేసుకొని జీవనం సాగిస్తుంది. శుక్రవారం వీధి కుక్క ఏడేళ్ల దివ్యాంగ బాలుడిపై దాడి చేసి పురుషాంగాన్ని సగానికి పైగా కొరికేసింది. ఈ ఘటనతో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. నొప్పితో విలవిల్లాడిపోయాడు.

కాటారంలో

బస్సు కోసం రోడ్డుపైనే ఎదురు చూస్తున్న ప్రయాణికులు

- బస్టాండ్ లేక ప్రయాణికుల పాట్లు
- రోడ్లపైనే పడిగాపులు
- ఆత్మగౌరవ సమస్యగా మారిన వైనం
- మంత్రి శ్రీధర్ బాబుపై గంపెడు ఆశలు
- నిర్మాణ స్థలం చుట్టూ నడుస్తున్న వివాదం

బస్టాండ్ కలేనా..!

పదిహేనేళ్ల నిరీక్షణకు తెరపడేదెప్పుడో..?

అక్షర దర్బార్,కాటారం : జయశంకర్ భూపాలపల్లి జిల్లా తర్వాత అంతటి ప్రాచుర్యం పొందినదిగా చెప్పుకుంటున్న మండలం కాటారం .. కాటారంలో సబ్డివిజన్ పోలీస్ కార్యాలయం ఉండగా గత ప్రభుత్వం ఆర్డీవో కార్యాలయాన్ని సైతం కేటాయిస్తూ ఆర్డినెన్స్ జారీ చేసింది.ప్రస్తుత ప్రభుత్వం ఆర్డీవో కార్యాలయానికి ఐఏఎస్ క్యాడర్ అధికారిని కేటాయించింది.గతంలో కాటారం మండలానికి చెందిన జక్కు శ్రీహర్షిణీ జయ శంకర్ భూపాలపల్లి జెడ్పీచైర్మన్గా ప్రాతినిథ్యం వహించగా ప్రస్తుతం ఇదే మండలం నుండి దుద్దిళ్ల శ్రీధర్బాబు తెలంగాణ ఐటీ మినిస్టర్గా కొనసాగుతున్నాడు. ఇంతటి ప్రాచుర్యత కల్గిన కాటారం మండలానికి బస్టాండ్ కొరత ప్రజలను వేధిస్తుంది. జిల్లా తర్వాత జిల్లాగా పిలువబడుతున్న కాటారంలో బస్టాండ్కే దిక్కులేదని హేళన చేస్తూ పలువురు మాట్లాడిన సందర్భాలు లేకపోలేదు. దీంతో చేసేదేం లేక బస్సుల కోసం షాపుల ముందు ఎండనకా.. వాననగా నిలబడి ఎదురుచూస్తూ ప్రజలు పడుతున్న తీరు వర్ణణాతీతం.

ఆత్మగౌరవం కోసం మహిళల పాట్లు

ఐదు మండలాలకు సెంటర్ గా కాటారం మండల కేంద్రం ఉండడంతో ఆయా మండలాల ప్రజలు కాటారం మండలకేంద్రానికి వచ్చి బస్సులు ఎక్కి వెళ్తుంటారు. అయితే కాటారం సెంటర్ చుట్టూ ప్రైవేట్ వ్యక్తులకు చెందిన షాపులు, ఇళ్లు, హోటళ్లు ఉండడంతో కొన్ని సార్లు బస్సులు రావడం ఆలస్యమైతే ప్రయాణికులు ఎక్కడ ఉండాలో తెలియని పరిస్థితి నెలకొంటున్నది. ఇక టాయిలెట్స్ విషయానికొస్తే ఎక్కడికెళ్లాలో తెలియని అయోమయ దుస్థితి. ఎటుచూసినా షాపులు, ఇళ్ళు దర్శనమిస్తుండగా ఎక్కడికీ వెళ్లలేక వారిలో వారే మదనపడిపోతున్నారు. ఇప్పుడీ సమస్య మహిళల ఆత్మ గౌరవ సమస్యగా మారడంతో బస్టాండ్ నిర్మాణం కోసం అందరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మంత్రి శ్రీధర్ బాబుపైనే ఆశలు

గత 15 ఏళ్లుగా కనీస బస్టాండ్ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సబ్డివిజన్ ప్రజలకు ఐటీ మినిస్టర్ శ్రీధర్బాబుపైనే గంపెడు ఆశలు పెట్టుకున్నారు. కాటారం మండలం నుండి ఐటీ మినిస్టర్గా ఉండడంతో ఇక బస్టాండ్ కష్టాలు తీరినట్లేనని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సొంత మండలంపై మమకారం చూపిస్తున్న మినిస్టర్ శ్రీధర్బాబు అధిక నిధులు కేటాయిస్తూ డెవలప్ చేస్తున్న తీరుపై ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ ప్రాంత రైతాంగానికి చిన్న కాళేశ్వరం, డబుల్ రోడ్లు, ఇతరత్రా అంతర్గత అభివృద్ధి నిధులు కేటాయిస్తుండగా త్వరలో కంపెనీలు పెట్టిస్తారనే ఆశలు అందరిలోనూ రేకెత్తుతున్నాయి. ఈ క్రమంలో బస్టాండ్ను సైతం నిర్మింపచేసి ఐదు మండలాల ప్రజల 15 ఏళ్ల కలను సాకారం చేస్తారని కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు.

బస్టాండ్ స్థలం చుట్టూ నడుస్తున్న వివాదం

కొన్నేళ్ల క్రితం కాటారం మండలం బొప్పారం గ్రామానికి చెందిన వూర రంగమ్మ ఎకరం భూమిని బస్టాండ్ కోసం ఆర్టీసీకి ఇచ్చారు. ఈ క్రమంలో కొన్నేళ్లుగా ఆ భూమి మీదుగా ఎలాంటి బస్సులు నడపకపోగా బస్టాండ్ నిర్మాణానికి ఆర్టీసీ యాజమాన్యం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అయితే సదరు భూమికి మార్కెట్లో వాల్యూ రావడంతో తమ పూర్వీకుల భూమి మాకే చెందుతుందని వారసులు కోర్టులో కేసు వేసినట్లు సమాచారం. దీంతో ఆర్టీసీ, రంగమ్మ తరపు వారసులు పిటిషన్స్ వేయగా కోర్టు పరిధిలో విచారణ జరుగుతుంది. అయితే కొన్ని నెలల క్రితం బస్టాండ్ నిర్మాణం చేపట్టడానికి ఆర్టీసీ అధికారులు ప్రయత్నించగా రంగమ్మ తరపు వారసులు వచ్చి అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొనగా ఇప్పటికీ పోలీస్ పహారా నడుమ స్థల వివాదం నడుస్తోంది. మొత్తానికైతే కాటారం బస్టాండ్ నిర్మాణానికి గ్రహణం పట్టినట్లయింది.

కోర్టులో కేసు నడస్తోంది..

భూపాలపల్లి డిపో మేనేజర్, లక్ష్మీనారాయణ కాటారం బస్టాండ్ నిర్మాణం కోసం గతంలో వూర రంగమ్మ భూమి ఇచ్చింది. ఈ భూమి విషయంలో కోర్టులో కేసు నడస్తోంది. కోర్టు నుండి తీర్పు వచ్చిన వెంటనే ముందుగా ప్రహరీ నిర్మించి యుద్ధ ప్రాతిపదికన బస్టాండ్ నిర్మాణం పూర్తి చేస్తాం. కోర్టు తీర్పు రావడమే ఆలస్యం. త్వరలోనే వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాం.

ట్రావెల్స్ ను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

కేసముద్రంలో అంజనీపుత్ర ట్రావెల్స్ ప్రారంభం

అక్షర దర్బార్, కేసముద్రం: కేసముద్రం మండల కేంద్రంలోని పొట్టి శ్రీరాములు సెంటర్లో అంజనీపుత్ర అధ్యక్షుడు పింగిళి సంతోష్ తమ గురువు నరసయ్య చేతుల మీదుగా అంజనీపుత్ర టూర్స్, ట్రావెల్స్,కన్సల్టెన్సీని శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అల్లం నాగేశ్వర రావు, సమ్మిగౌడ్ పాల్గొని అంజనీపుత్ర యూనియన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పింగిళి సంతోష్ మాట్లాడుతూ.. కేసముద్రం మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విష్ణు నారాయణ,పోలేపల్లి యాకూబ్ రెడ్డి,మంచన సతీష్, డాక్టర్ చంద్రశేఖర్,గుగులోత్ వీరు నాయక్,ముత్యాల శివకుమార్,బట్టు శ్రీను,గోట్టం సుభాష్,యూనియన్ సభ్యులు చిలుముల మహేష్,నాగుల్,గణేష్, సూరయ్య,రమేష్,అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మహాదేవపూర్ సీఐ రామచందర్ రావు

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

మహాదేవపూర్ సీఐ రామచందర్ రావు

అక్షర దర్బార్, మహాదేవపూర్: నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని మహాదేవపూర్ సిఐ రామచందర్ రావు అన్నారు. మండలంలోని రౌడీ షీటర్లు, అనుమానిత వ్యక్తులను పోలీస్ స్టేషన్ కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మహాదేవపూర్ ఎస్సై పవన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పాపన్న గౌడ్ జయంతిని జయప్రదం చేయాలి

అక్షర దర్బార్, తొర్రూరు : గోల్కొండ కోటను ఏలిన బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 374వ జయంతి సందర్భంగా ఈనెల 24న హైదరాబాదులోని రవీంద్ర భారతిలో జైగౌడ్ ఉద్యమం ఆధ్వర్యంలో జరిగే జయంతి ఉత్సవాలలో గౌడ కులస్తులు పాల్గొని జయప్రదం చేయాలని జైగౌడ్ ఉద్యమ జాతీయ అధ్యక్షుడు వట్టికూటి రామారావు గౌడ్, గోపా జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని స్థానిక విశ్రాంతిభవనంలో పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాల గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గోపా డివిజన్ అధ్యక్షుడు తాళ్లపల్లి రమేష్ గౌడ్, గోపా మండల అధ్యక్షుడు రాయిపల్లి యాకయ్య గౌడ్, గౌడ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు దీకొండ శ్రీనివాస్ గౌడ్, కొండిన్య సహకార పరపతి సంఘం అధ్యక్షుడు నాగపురి అశోక్ గౌడ్, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటగిరి కుమార్ గౌడ్, కంఠమహేశ్వర సహకార పరపతి సంఘం అధ్యక్షుడు నిమ్మల శేఖర్ గౌడ్, సంఘం నాయకులు నిమ్మల వెంకన్న గౌడ్, అన్నపురం వెంకన్న గౌడ్, బెల్లంకొండ దేవేందర్ గౌడ్, రావుల యాదగిరి గౌడ్, ఓం ప్రకాష్ గౌడ్, మోడెం సోమనరసయ్య గౌడ్, చిరగాని రమేష్ గౌడ్, పులి ముత్తిలింగం గౌడ్ పాల్గొన్నారు.

మత్తడి పోస్తున్న పాకాల సరస్సు

అక్షర దర్బార్, ఖానాపురం : గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో పాకాల సరస్సు ముత్తడి పోస్తోంది. సరస్సు 30 ఫీట్లతో ముత్తడి పోయడంతో రెండు పంటలకు డోకా లేదంటూ ఆయకట్టు రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో మత్తడిని తిలకిస్తున్నారు. రైతులు కట్ట మైసమ్మకు పూజలు చేసి పసుపు కుంకుమ సరస్సులో కలుపుతున్నారు.

అక్షర దర్బార్ voice of the people తెలుగు దినపత్రిక

- ఆరేండ్లైనా పూర్తికాని నిర్మాణం
- భవనం లేక అవస్థలు పడుతున్న అధికారులు
- ప్రారంభిస్తారా లేక ఆక్రమించుకుంటారా
- ఇష్టారాజ్యంగా కాంట్రాక్టర్
- నిర్మాణం పూర్తి చేసి వెంటనే ప్రారంభించాలని గ్రామస్తుల డిమాండ్

జీపీ భవనానికి మోక్షం ఎప్పుడో..?

అక్షర దర్బార్,కేసముద్రం : గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు.వాటి అభివృద్ధితోనే దేశాభివృద్ధి అంటూ వివిధ పార్టీల నాయకులు,ప్రజా ప్రతినిధులు ప్రసంగాలు ఇస్తున్నప్పుడు తరచూ వింటూనే ఉన్నాం.ఆరేండ్లైన పంచాయతీ భవనం పూర్తికాక ప్రారంభానికి నోచుకోక ఉత్సవ విగ్రహం వలె దర్శనమిస్తుంది.గ్రామ స్వరాజ్యానికి కేంద్రమైన పంచాయతీ భవనం తుది దశలో ఉండటం గమనార్హం.గత ప్రభుత్వం గ్రామాలలో పరిపాలన సౌలభ్యం కోసం లక్షల రూపాయలను వెచ్చించి నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.అయితే కాంట్రాక్టర్ నిర్లక్ష్యం మూలానో లేక సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వలనో కానీ భవనం అసంపూర్తిగానే మిగిలిపోయింది.మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామంలో గత ఆరు సంవత్సరాల క్రితం ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి 13 లక్షల భారీ వ్యయంతో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించారు.అయితే నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనం మాత్రం ప్రారంభానికి నోచుకోవడం లేదు.ప్రభుత్వం ఎన్నో నిధులు వెచ్చించి కొత్త భవనాన్ని కట్టించి ఏండ్లు గడుస్తున్నా కిరాయి భవనం నుంచి కొత్త భవనంలోకి గ్రామపంచాయతీ మార్చకపోవడం గ్రామంలో ఇప్పుడు చర్చనీయంగా మారింది.రాష్ట్రంలోని అనేక గ్రామాల్లో కొత్త భవనాలు నిర్మించుకునేందుకు నిధులు లేక ఎదురుచూపులు చూస్తుంటే నారాయణ పురం గ్రామంలో మాత్రం తయారీగా ఉన్న కొత్త భవనంలోకి మారేందుకు అడ్డంకులు ఏమున్నాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ఈ భవనాన్ని వాడకుండా నిరుపయోగంగా ఉంచితే త్వరగా శిథిలావస్థకు చేరే అవకాశంతో పాటు, గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతుందని స్థానికులు వాపోతున్నారు.గ్రామ అభివృద్ధి కోసం అధికారులు పాలకవర్గ సభ్యులు నిర్వహించాల్సిన సమావేశాలు నేటికీ అద్దె భవనంలోనే కొనసాగుతున్నాయి.కాంట్రాక్టర్ నిర్లక్ష్యం మూలాన సంవత్సరాలు కావస్తున్న నేటికీ భవనం ప్రారంభం కాక ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా కాంట్రాక్టర్ వ్యవహరిస్తున్న తీరు పట్ల స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.సదరు గుత్తేదారుకు భవనానికి సంబంధించిన బిల్లులు పూర్తిస్థాయిలో వచ్చిన భవనాన్ని ప్రారంభించకపోవడం వెనక ఆంతర్య మేంటని స్థానికులు చర్చించుకుంటున్నారు.సంబంధిత కాంట్రాక్టర్ భవనాన్ని ప్రారంభిస్తారా లేక ఆక్రమించుకుంటారా అనే అనుమానాలు సైతం గ్రామంలో వ్యక్తమవుతున్నాయి.ఏదిఏమైనాప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్ పై స్థానిక శాసనసభ్యులు చర్యలు తీసుకుని నారాయణ పురం గ్రామపంచాయతీ భవన ప్రారంభానికి అధికారులను ఆదేశించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.మరి స్థానిక శాసనసభ్యులు చొరవ చూపుతారా లేదా వేచి చూడాల్సిందే మరి...

భవనాన్ని తొందరగా ప్రారంభించాలి

తాడూరి ఉమేష్, స్థానికుడు

ఆరు సంవత్సరాలు కావస్తున్న గ్రామపంచాయతీ భవనం ప్రారంభించకపోవడం బాధాకరం.కాంట్రాక్టర్ను పలుమార్లు అడిగిన నా ఇష్టం వచ్చినప్పుడు ప్రారంభిస్తా అంటున్నారు.స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పందించాలి.మా గ్రామంలో ఉన్న నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలి.ప్రజాధనంతో నిర్మించిన భవనం దుర్వినియోగం కాకుండా ఎమ్మెల్యే కాపాడాలి...

అభివృద్ధి చేసి అప్పుల పాలయ్యాం

- పెండింగ్ బిల్లులు చెల్లించాలి
- తాజా, మాజీ సర్పంచ్ ల ఆవేదన

అక్షర, దర్బార్ రేగొండ: గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసి అప్పుల పాలయ్యామని, పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని రేగొండ మండలంలోని పలువురు మాజీ సర్పంచ్ లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్ లుగా ఉండి గ్రామాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దామని, ఇలాంటి చాలా పనుల్లో బిల్లులు రాక అవస్థలు పడుతున్నామని వాపోయారు. తమ పదవీకాలం ముగిసి 5 నెలలు కావస్తున్నా పెండింగ్ బిల్లులు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి పెండింగ్ బిల్లులు వచ్చేలా కృషి చేయాలని కోరారు. పెండింగ్ బిల్లులు తక్షణమే ప్రభుత్వం ఇవ్వకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని కొందరు మాజీ సర్పంచ్ లు తెలుపుతున్నారు.

బిల్లులు ఇచ్చే ఎన్నికలకు

అంబాల చందు గౌడ్, సుల్తాన్ పూర్, మాజీ సర్పంచ్

మా బాధలను ముఖ్యమంత్రి అర్థం చేసుకోవాలి. పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలి. లేదంటే కొత్త సర్పంచ్ లతో మాకు ఇబ్బందులు వస్తాయ్. బకాయిలు ఇవ్వకుండా ఎన్నికలకు వెళ్తే ఆందోళన చేస్తాం. అప్పుచేసి అభివృద్ధి పనులు చేశా. పంచాయతీకి ఇంకా రూ. 8 లక్షల బిల్లులు రావాలి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు అవుతున్నా పంచాయతీకి రూపాయి కూడా ఇవ్వలేదు. మొన్న కేంద్ర ప్రభుత్వ నిధులు మా పంచాయతీకి సుమారు రూ.లక్షపైన జమ అయ్యాయి. వాటిని ముందుగా మాకే అందజేయాలి. మా సర్పంచ్ ల బిల్లులు పూర్తయ్యాకే పంచాయతీ కార్యదర్శులకు అందజేయాలి.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న టవేరా వాహనం

-మహిళ మృతి, మరో ఇద్దరికి గాయాలు

అక్షర దర్బార్, మహాదేవపూర్ :మండల కేంద్రంలోని అయ్యప్ప గుడి వద్ద అదుపుతప్పి టవేరా వాహనం ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో వాహనంలో ఉన్న మహిళ మృతి చెందింది. మండలంలోని అంబటిపల్లి గ్రామానికి చెందిన దగ్గ శాంతమ్మ భూపాలపల్లి ఆసుపత్రికి వెళ్లి తిరుగు ప్రయాణంలో టవేరా వాహనంలో వస్తోంది. ఈ క్రమంలో వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శాంతమ్మ మృతి చెందగా, వాహనం డ్రైవ్ చేస్తున్న మృతురాలి కుమారుడు దగ్గ వెంకటేష్, అతడి భార్య గాయపడినట్లు బంధువులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి పట్టివేత..

అక్షర దర్బార్, పరకాల : పరకాల పట్టణంలో శుక్రవారం పక్కా సమాచారంతో ఒక యువకుడి నుండి 250 గ్రాముల గంజాయిని పరకాల అంబేద్కర్ సెంటర్లో పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు పట్టణానికి చెందిన నదీమ్ గా గుర్తించారు. పరకాల పట్టణంలో సాయంత్రం వేళలో నిత్యం యువకులు గంజాయి సేవిస్తున్నారన్న చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో పోలీసులు పట్టణంలో గంజాయి రవాణాపై నిఘా పెట్టారు.

ర్యాగింగ్ రక్కసికి దూరంగా ఉండాలి

కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్ రెడ్డి

అక్షర దర్బార్, కాటారం : ర్యాగింగ్ రక్కసికి విద్యార్థులు దూరంగా ఉండాలని కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్రెడ్డి సూచించారు. కాటారం మండలంలోని పాలిటెక్నిక్ కాలేజీలో శుక్రవారం ర్యాగింగ్పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ర్యాగింగ్ కు పాల్పడినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్సై మ్యాక అభినవ్, లెక్చరర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి

మృతుడి కుటుంబానికి బీమా సొమ్ము అందజేత

నర్సంపేట, అక్షర దర్బార్ : నర్సంపేట మండలంలోని చంద్రయ్యపల్లి గ్రామంలో చంద్ర పురుషుల సంఘం సభ్యుడు బరిగెల కొమురయ్య అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబానికి సంఘం అధ్యక్షుడు కందుల శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన దుగ్గొండి పురుషుల సమితి అధ్యక్షుడు మహమ్మద్ ఉస్మాన్ చేతుల మీదుగా బీమా డబ్బులు రూ.10 వేలు మృతుడి భార్య బరిగెల భాగ్యకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు బానోతు రమేష్, సభ్యులు మృత్యుంజయుడు, రాజు, ప్రభాకర్, రాజు, ఐలయ్య, చరణ్ రాజ్, సాంబయ్య, గణేష్, ఆజ్మీర జితేందర్, మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

డబ్బులు అందజేస్తున్న పొదుపు సంఘం సభ్యులు

నిరుపేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ

అక్షర్ దర్బార్, పరకాల : సీఎం సహాయనిధి నిరుపేదలకు వరంలా మారిందని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శాయంపేట మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందిన సింధుజ అనారోగ్యంతో బాధపడుతుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం భూపాలపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో సింధుజ తండ్రి సుధాకర్ కు రూ.1.50 లక్షల విలువ చేసే ఎల్ వోసీ పత్రాన్ని ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యేకు బాధితులు ధన్యవాదాలు తెలిపారు.

ఎల్వోసీని అందజేస్తున్న ఎమ్మెల్యే గండ్ర

వెంకటాపురంలో మొక్కలు నాటుతున్న ప్రత్యేక అధికారి సంగీతలక్ష్మి

పరకాలలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ సంపత్ కుమార్, తదితరులు

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

అక్షర దర్బార్, దుగ్గొండి : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేక అధికారి డిప్యూటీ డైరెక్టర్ సంగీత లక్ష్మి సూచించారు. శుక్రవారం దుగ్గొండి మండలం వెంకటాపురం గ్రామంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి నీళ్లు పోశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి రాంరెడ్డి, ఎంపీడీవో అరుంధతి, ఏపీఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి వైనాల యాదగిరి పాల్గొన్నారు.

పరకాలలో స్వచ్ఛదనం- పచ్చదనం

అక్షర దర్బార్, పరకాల : ప్రభుత్వ జూనియర్ కళాశాల పరకాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఆవరణను శుభ్రపరిచి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కే.సంపత్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతను పాటించి, మొక్కలను నాటి పచ్చదనాన్ని పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎండి సర్దార్, అధ్యాపకులు లతా మాధవి, పద్మ వెంకట్ రెడ్డి, రవీందర్ రెడ్డి, వీర్య ప్రసాద్, నాన్ టీచింగ్ సిబ్బంది రమేష్, కమలాకర్, సత్యనారాయణ, నరేష్, సాంబయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు పంపిణీ చేస్తున్న చైర్ పర్సన్ సోద అనిత

ఇంటింటికి మొక్కల పంపిణీ

పదో వార్డులో స్థానిక కౌన్సిలర్ పసుల లావణ్య రమేష్ ఆధ్వర్యంలో ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ముఖ్యఅతిథిగా చైర్ పర్సన్ సోద అనిత రామకృష్ణ హాజరై మొక్కల పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో 7వ వార్డు కౌన్సిలర్ నల్లెల్ల జ్యోతి అనిల్ కుమార్, వార్డు ఆఫీసర్ కె.శోభారాణి, ఆశా వర్కర్ సుజాత, శిరీష పాల్గొన్నారు.

సుంకిశాల ప్రాజెక్టుపై అసత్య ప్రచారం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, అక్షరదర్బార్ : సుంకిశాల ప్రాజెక్టుపై ప్రభుత్వం అసత్య ప్రచారం చేస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఆ ప్రాజెక్టుకు పునరుజ్జీవం తెచ్చిందే బీఆర్ఎస్ ప్రభుత్వమని చెప్పారు. హైదరాబాద్ నీటి అవసరాల కోసం సుంకిశాల ప్రాజెక్టు మొదలుపెట్టారని, అయితే దానిని నల్లగొండ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తుచేశారు. తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీతో కలిసి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. నాగార్జునసాగర్‌లో డెడ్‌స్టోరేజీ ఉన్నా హైదరాబాద్‌కు నీటికష్టాలు రాకూడదనే ఈ ప్రాజెక్టు చేపట్టామన్నారు. హైదరాబాద్‌తోపాటు చుట్టుపక్కల గ్రామాలకు సాగు, తాగునీటి కోసం సుంకిశాల ఉపయోగపడుతుందని చెప్పారు. హైదరాబాద్‌కు 50 ఏండ్లు తాగునీటి అవసరాలకు సరిపడేలా తమ హయాంలో ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. సుంకిశాల ఘటనను ప్రభుత్వం ఎందుకు తొక్కిపెట్టిందని ప్రశ్నించారు. ఆగస్టు 2న ఉదయం 6 గంటలకు ఘటన జరిగితే ప్రభుత్వానికి సమాచారం లేదా లేక విషయాన్ని కప్పిపెట్టారా అని ప్రశ్నించారు.

పాలీసెట్ తక్షణ ప్రవేశాలకు దరఖాస్తులు

అక్షర దర్బార్, వరంగల్: వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలీసెట్ – 2024 తక్షణ ప్రవేశాల కోసం ఈ నెల 8 నుంచి దరఖాస్తులు స్వీకరణ ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్ వెల్లడించారు. పాలీసెట్ – 2024 ఉత్తీర్ణులై డిప్లమా ప్రవేశం పొందని విద్యార్థులు, పాలీసెట్ – 2024 ఉత్తీర్ణులు కాని విద్యార్థులు స్పాట్ అడ్మిషన్స్ కు అర్హులని ఆయన తెలిపారు. గవర్నమెంట్ పాలిటెక్నిక్, వరంగల్ లో స్పాట్ అడ్మిషన్స్ కోసం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో 7 సీట్లు ఖాళీగా ఉన్నాయని ప్రిన్సిపాల్ పేర్కొన్నా రు. స్పాట్ అడ్మిషన్స్ కోసం విద్యార్థులు పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 11 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈనెల 12న ఉదయం 11 గంటలకు హాజరుకావాలని ప్రభాకర్ ప్రకటించారు.

ముగిసిన పార్లమెంట్ సమావేశాలు..

ఉభయసభలు నిరవధిక వాయిదా

ఢిల్లీ, అక్షరదర్బార్ : పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిశాయి. ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఇక ఈ సమావేశాల్లో పలు కీలక అంశాలు చర్చకు వచ్చాయి. ముఖ్యంగా నీట్ లీకేజీ వ్యవహారం, రైల్వే భద్రత తదితర అంశాలు ఉభయ సభలను కుదిపేశా యి. పార్లమెంట్ సమావేశాలు గతనెల 22 నుంచి ప్రారంభమైన విషయం తెలిసిందే. తొలి రోజు 2023–24 ఆర్థికసర్వేను ఆర్థికమంత్రి లోక్ సభలో ప్రవేశపెట్టారు. ఆ తర్వాత 23న ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పూర్తిస్థాయి బడ్జెట్‌ను ఎన్డీయే కూటమి ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈ బడ్జెట్‌పై ఉభయ సభల్లో వాడీవేడిగా చర్చ కొనసాగింది. ఇక ఈ సమావేశాలు ఆగస్టు 12వ తేదీ వరకూ కొనసాగుతాయని ప్రభుత్వం ముందే ప్రకటించినప్పటికీ ఉభయ సభలు ముందుగానే నిరవధికంగా వాయిదా పడ్డాయి.

మున్సిపల్ అధికారి ఇంట్లో నోట్ల కట్టలు..

- ఏసీబీ దాడుల్లో బయటపడిన ఆస్తులు
- నిజామాబాద్ మున్సిపల్ సూపరింటెండెంట్ దాసరి నరేందర్ నివాసంలో
- రూ.2.93 కోట్ల నగదు పట్టివేత..
- మొత్తం ఆస్తుల విలువ రూ. 6.07 కోట్లు..

నిజామాబాద్, అక్షరదర్బార్: నిజామాబాద్ మున్సిపల్ సూపరింటెండెంట్ దాసరి నరేందర్ నివాసంపై ఏసీబీ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో భారీగా నగదు, ఆదాయానికి మించిన ఆస్తులు బయట పడ్డాయి. అతడి ఇంట్లో రూ.2.93 కోట్ల నగదు పట్టుబడింది. అలాగే రూ.1.10 కోట్ల బ్యాంకు బ్యాలెన్స్ నరేందర్, అతని భార్య, తల్లి ఖాతాల్లో ఉన్నట్లుగా గుర్తించారు. వీటితో పాటు 51 తులాల బంగారం, రూ.1.98 కోట్ల విలువైన స్థిరాస్తులను గుర్తించారు. ఇప్పటివరకు స్వాధీనం చేసుకున్న మొత్తం ఆస్తుల విలువ దాదాపు రూ. 6.07 కోట్లు ఉంటుందని ఏసీబీ అధికారులు తెలిపారు.

నరేందర్ పై తీవ్ర అవినీతి ఆరోపణలు

నిజామాబాద్ మున్సిపల్ సూపరింటెండెంట్‌గా ఉన్న దాసరి నరేందర్.. రాజకీయ పార్టీల నేతలతో సన్నిహితంగా ఉంటూ.. ప్రాధాన్య పోస్టుల్లోనే కదలకుంటా ఉంటారని అందినకాడికి దండుకుంటారన్న ఆరోపణలు ఉన్నాయి. నిజామాబాద్ మున్సిపల్ పరిధిలో మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయానికి గండి కొట్టి ఆయన ఆదాయాన్ని పెంచుకున్నారని ఏసీబీకి అనేక ఫిర్యాదులు వచ్చాయి. దీంతో వెంటనే విచారణ ప్రారభించారు. అంతేకాదు.. గతంలో కూడా ఆయన ఏసీబీకి చిక్కడం గమనార్హం.

దేశ, రాష్ట్ర రాజకీయాల్లో యూత్ కాంగ్రెస్ స్పెషల్

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చీమల సందీప్

అక్షర దర్బార్, కాటారం : దేశ, రాష్ట్ర రాజకీయాల్లో యూత్ కాంగ్రెస్ పాత్ర ఎల్లప్పుడూ ఉంటుందని కాటారం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చీమల సందీప్ పేర్కొన్నారు. శుక్రవారం కాటారం మండలకేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చీమల సందీప్ మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంలో యూత్ కాంగ్రెస్ సభ్యుల పాత్ర అనిర్వచనీయమని అన్నారు. కాటారం సెంటర్లో యూత్ కాంగ్రెస్ జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య,కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ప్రభాకర్రెడ్డి, నాయకులు అంగజాల అశోక్, మహేష్, రాజబాపు పాల్గొన్నారు.

ఘనంగా యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

అక్షర దర్బార్,మహాదేవపూర్ : యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కటకం అశోక్ ఆధ్వర్యంలో జెండా ఎగరవేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అక్బర్ ఖాన్, ఉపాధ్యక్షుడు కోట సమ్మయ్య, మండల అధికార ప్రతినిధి బుర్రి శివరాజ్, యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి లేళ్ల ముక్తేశ్వర్, పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నయుముద్దీన్, ఎన్ఎస్ యు ఐమండల అధ్యక్షుడు రంజిత్ రెడ్డి, తో పాటు పల్వర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.